మినీట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన ఏర్పాట్లు షురూ...



హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చైతన్యపురి: సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద నిమజ్జన ఏర్పాట్లు ఇంకా ప్రారంభం కాలేదని 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు పనులు ప్రారంభించారు. ఎల్రక్టికల్ అధికారులు సరూర్‌నగర్ కట్టపై లైటింగ్ సిస్టం పనులు చేపట్టారు. హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. నిమజ్జన బందోబస్తు నిమిత్తం కట్టపై ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయనున్నట్లు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు, నిమజ్జన బందోబస్తులో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

వెంకట్రామారెడ్డి సేవలు ఎనలేనివి



వెంకట్రామారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న రెడ్డి సంఘ సభ్యులు

చంపాపేట: రెడ్డి కులస్తుల సంక్షేమం కోసం రాష్ట్రంలో రెడ్డి సంఘాన్ని ఏర్పాటు చేసి రెడ్లను ఒకే తాటిపై నడిపిన యోధుడు రాజ్ బహద్దూర్ వెంట్రామారెడ్డి అని సంఘ కార్యవర్గ సభ్యుడు బద్దూరి వెంకటేశ్వర రెడ్డి అన్నారు. రాజ్ బహుద్దూర్ వెంకట్రామారెడ్డి 156వ జయంతి సందర్భంగా శుక్రవారం చంపాపేట వైశాలీనగర్ కాలనీలోని రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వెంకట్రామారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వెంకటరామిరెడ్డి నిజాం పాలకులకు నమ్మకస్తుడుగా వ్యవహరిస్తూనే పేద రెడ్డి కులస్తులను ఆర్థికంగా ఆదుకున్నాడన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు నరసింహారెడ్డి, లింగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించాలి

చాదర్‌ఘాట్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని దివ్యాంగులకు హక్కుల పోరాట సమితి నాయకుడు నల్లగొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ కార్యాలయంలో మాట్లాడుతూ దివ్యాంగులకు కేటాయించిన సీట్లు వారికే కేటాయించేలా కండక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగాల్లో దివ్యాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అన్ని బస్‌స్టేషన్లలో దివ్యాంగులకు అనుకూలంగా వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీవీహెచ్‌ఎస్ అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్, సంఘం నాయకులు నాగరాజు, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరిస్తానని స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని క్రాంతినగర్ కాలనీలో రూ.60 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమమ సంఘ ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, జనార్దన్, రామకృష్ణ, మురళీ, ఆనంద్, నాయకులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యను పరిష్కరించండి



ఎస్‌జీఎస్‌కు సమస్యలను విన్నవిస్తున్న ఉస్మాన్‌గంజ్ మార్కెట్ వ్యాపారులు

చాదర్‌ఘాట్: ఉస్మాన్‌గంజ్ మార్కెట్లోని దుకాణాల్లోకి వర్షపునీరు చేరి సరుకు పాడవుతుందని సమస్యను పరిష్కరించేంత వరకు తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉస్మాన్‌గంజ్ మార్కెట్ అసోషియేషన్ అధ్యక్షుడు నరేందర్, సభ్యులు, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం మలక్‌పేటలోని మార్కెట్ కార్యాలయంలో ఎస్‌జీఎస్‌ను కలిసిన వారు చిన్నపాటి వర్షాలకే వరదనీరు దుకాణాల్లోకి చేరటంతో సరుకులు పాడైపోతున్నాయన్నారు. దీనిపై స్పందించిన ఎస్‌జీఎస్ త్వరలో మార్కెట్‌ను సందర్శించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సర్వ్య పరిష్కారం అయ్యే వరకు వ్యాపారులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామన్నారు.

ఆగుతూ..సాగుతూ...

నత్తనడకన స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు

- ఐదేళ్లుగా ముందుకు సాగని వైనం
- ఇటీవల పనులను పరిశీలించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్
- వేగవంతం చేయాలని ఆదేశాలు



సైదాబాద్ రహదారిపై వివాదానికి కారణమైన ప్రాంతం



చంచల్‌గూడ వద్ద కొనసాగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు

సైదాబాద్: సైదాబాద్‌లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణం ఒక అడుగు ముందుకు...మూడు అడుగులు వెనుక్కు అన్నట్లుగా సాగుతోంది. సైదాబాద్ ప్రధాన రహదారిపై పురాతన ఆంజనేయస్వామి ఆలయం వద్ద నెలకొన్నా వివాదం కారణంగా రెండున్నరేళ్లుగా నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఇటీవల ఉన్నతాధికారులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ వచ్చే ఏడాది మార్చి లోగా నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. 2020లో అప్పటి రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన సైదాబాద్ స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణ పనులు ఐదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ ప్రకటించినట్లుగా ఏడు నెలల్లో పూర్తవుతాయా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయం వద్ద వివాదం...

సైదాబాద్ స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం మొదట నిర్ధారించిన అలైన్‌మెంట్ ప్రకారం సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న హనుమాన్ ఆలయం ముందు నుంచి వెళుతుంది. అయితే నిర్మాణ పనులు ప్రారంభించిన తర్వాత అధికారులు అలైన్‌మెంట్ మార్చడంతో అదే ఆలయం మీదుగా వెళుతుంది. దీంతో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అలైన్‌మెంట్ మార్పును వ్యతిరేఖిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులతో కలిసి పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. తమ ప్రాణాలు పోయినా ఆలయం పై నుంచి నిర్మాణం జరగనివ్వమని భీష్మించుకున్నారు. దీంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి.

ప్రజాప్రతినిధి జోక్యంతో సయోధ్య...

అలైన్‌మెంట్ వివాదం కారణంగా స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావటంతో పరిస్థితి చక్కదిద్దేందుకు పాతబస్తీ ప్రజాప్రతినిధి చొరవ తీసుకున్నారు. నష్ట పరిహారంగా ఆలయానికి అనుకుని వెనుక వైపు ఉన్న ఇంటిని కొనుగోలు చేసి ఆలయానికి స్థలం ఇచ్చేలా ప్రతిపాదించారు. ఎట్టకేలకు ఈ ప్రతిపాదనకు ఆలయ కమిటీ సభ్యులు ఒప్పుకోవడంతో పనులకు ఆటంకాలు తొలగినట్లు భావిస్తున్నారు.

- అయితే ఆలయానికి పరిహారంగా ఇస్తారని చెబుతున్న స్థలం జైళ్లశాఖకు చెందినదిగా తెలుస్తోంది. అయితే జైళ్లశాఖకు చెందిన స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఎలా సేకరిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సైదాబాద్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న తమ శాఖ స్థలాలను పరిరక్షించటానికి జైళ్లశాఖ అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. జైళ్లశాఖకు చంచల్‌గూడ, సైదాబాద్, మాదన్నపేట పరిసరాల్లో స్థలాలు ఉన్నాయి. వాటిలో కొన్ని ఇప్పటికే కొన్ని అన్యాక్రాంతం కాగా ఉన్న స్థలాలను తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.
- ఆలయంపై నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం పోనివ్వమని భీష్మించిన ఆందోళనకారులు ఇప్పుడు ఎటూ తేలని స్థితిలో మిన్నకుండిపోయారు. నిర్మాణం ఆలయం పై నుంచి వెళ్లటం ఖాయంగా తెలుస్తుంది. అయితే ఆలయానికి పరిహారంగా వెనుక వైపు కొంత స్థలం వస్తుందని భావించారు. అయితే ఇప్పుడు అది కూడా వచ్చే పరిస్థితి లేక పోవడంతో కమిటీ సభ్యుల్లో అయోమయం నెలకొంది.



పనులను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు (ఫైల్)

శరవేగంగా పనులు..

నత్తనడకన సాగిన స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు ఇటీవల మళ్లీ ప్రారంభమయ్యాయి. జీహెచ్‌ఎంసీ కమిషనర్ సైతం పనుల పురోగతి పరిశీలించారు. పనులు వేగవంతం చేసి మార్చి 2026లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు వేగంగా పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దళిత వాడలపై చిన్నచూపు తగదు



సాహెబ్‌నగర్‌లో పర్యటిస్తున్న కీసర నర్సిరెడ్డి

హస్తినాపురం: దళిత వాడల అభివృద్ధిలో పాలకులు, అధికారులు నిర్లక్ష్య వహిస్తున్నారని, ప్రభుత్వం చొరవ తీసుకుని దళిత వాడలను అన్ని విధాల అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని హయత్‌నగర్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి కీసర నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని సాహెబ్‌నగర్ అజ్మాయిగూడ దళితవాడలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్టు) హయత్‌నగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగాగా కీసర నర్సిరెడ్డి మాట్లాడుతూ దళితవాడలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమస్యను స్థానిక కార్పొరేటర్ లచ్చిరెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. దళిత వాడలపై ప్రజాప్రతినిధులకు నిర్లక్ష్యం తగదన్నారు. సమస్యను పరిష్కరించే వరకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మలక్‌పేట బ్రహ్మాకుమారీస్‌లో రక్తదానం శిబిరం

మలక్‌పేట: ప్రపంచ సోదర దినోత్సవం సందర్భంగా రాజయోగిని దాది ప్రకాశమణిజీ 18వ, ఆరోహణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మలక్‌పేట బ్రహకుమారీస్ సెంటర్‌లో ఈనెల 23న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ, ఐఎస్‌బీటీఐ, రెడ్ క్రాస్ సొసైటీ ఆఫ్ ఇండియా, రోటరీ ఇంటర్ నేషనల్, లయన్స్ ఇంటర్ నేషనల్ తదితర సంస్థల సౌజన్యంతో బ్రహ్మకుమారీస్ సోషల్ సర్వీస్ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిబిరాన్ని శనివారం ఉదయం 10.30 గంటలకు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రారంభిస్తారని తెలిపారు. వివరాలకు 93980 46546 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ మహాధర్నా వాల్‌పోస్టర్ విడుదల



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మలక్‌పేట: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టి. తిరుపతిరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి మహాధర్నా వాల్‌పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులందరూ మహాధర్నాకు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సైదాబాద్ డిప్యూటీ ఐవోఎస్ పి. వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజనేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి కే. వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీవాణి, సునీత, అమ్మాజీ, నిర్మల, రాము, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం

చాదర్‌ఘాట్: రైతులు, వినియోగదారులు, వ్యాపారులతో నిత్యం రద్దీగా ఉండే మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మార్కెట్ ఎస్‌జీఎస్ చిలు నర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మార్కెట్ కార్యాలయంలో మాట్లాడుతూ మార్కెట్‌లో దాదాపు 400 దుకాణాలు ఉండగా 10కి పైగా ఉల్లిపాయల షెడ్లు ఉన్నాయన్నారు. దూర ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వచ్చే వారికి దుకాణాల నెంబర్లు, షెడ్ల వివరాలు తెలియక ఇబ్బందులు పడుతున్నందున సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

నాగోలు: ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు 'సేవ్ హైదరాబాద్' పేరుతో శుక్రవారం చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్‌ను సెక్రటేరియట్ సమీపంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు సమీపంలోని పోలీస్ స్టేషన్ తరలించారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, ఎలిమినేటి జంగారెడ్డి, వగ్గుల సత్యనారాయణ, గట్టు మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అరెస్టులు అనైతికం

చలో సెక్రటేరియట్ నేపథ్యంలో నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌ను నాగోలు పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో తమను అడ్డుకోలేరన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, అరెస్టులు చేసినా వెనక్కి తగ్గేది లేదన్నారు. అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల శ్రీనివాస్ గౌడ్, నవీన్ రెడ్డి, మహిళా నాయకులు రుపాలి సింగ్ తదితరులు ఉన్నారు



కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు..

బీజేపీ నాయకుల అరెస్ట్

సైదాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ చేపట్టిన చలో సెక్రటరియేట్‌ను పోలీసులు భగ్నం చస్తశారు. శుక్రవారం ఉదయం పోలీసుల హౌస్ అరెస్టను తప్పించుకుని వివిధ మార్గాల్లో సెక్రటరియేట్ వద్దకు చేరుకునేందుకు యత్నించిన పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో కొందరిని అఫ్జల్‌గంజ్ పీఎస్‌కు తరలించారు. ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమదుకర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి తదితరులను అరెస్ట్ చేసి అఫ్జల్‌గంజ్ పీఎస్‌కు తరలించారు. సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డిని శుక్రవారం ఉదయం సైదాబాద్ రెడ్డి బస్తీలోని ఆమె నివాసంలో సైదాబాద్ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.



పోలీసుల అదుపులో నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ



పోలీసుల అదుపులో ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి



అఫ్జల్‌గంజ్ పీఎస్‌లో బీజేపీ నాయకులు సుభాష్‌చందర్జీ, జంగం మధుకర్‌రెడ్డి

2500 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా తదితరులు

వనస్థలిపురం: స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ వనస్థలిపురం, జేసీఐ హైదరాబాద్ ఫీనిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం వనస్థలిపురంలో 2500 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు, యువతలో జాతీయ ఐక్యత, దేశభక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తాయన్నారు. నిర్వాహకులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.జే.ఎస్.నందకిషోర్ మాట్లాడుతూ యువతలో దేశభక్తిని పెంపొందించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల శ్రీనివాస్, జిట్టా రాజశేఖర్ రెడ్డి, చింతల రవికుమార్, శ్రీధర్‌గౌడ్, మధుగౌడ్, సంజయ్, సతీష్‌గౌడ్, సువిధ, నీరజ్, భాస్కర్, చతుర్వేది, వేణుగోపాల్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రవిందర్, నరసింహులు, దూరయ్య, రాంప్రసాద్, కుమార్, శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

దుర్గాదేవికి పుష్పాలంకరణ



దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

మన్సూరాబాద్: శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని నాగోల్ డివిజన్ పరిధి శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి దేవాలయంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, అజయ్, మురళీ, రమణమూర్తి, అర్చకులు బాల మురళీశర్మ తదితరులు పాల్గొన్నారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

డివిజన్ పరిధి విజయశ్రీకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సైదాబాద్: శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని సైదాబాద్, ఐఎస్‌సదన డివిజన్ల పరిధిలోని అమ్మవారి దేవాలయాలు ఆధాత్మిక శోభను సంతరించుకున్నాయి. సైదాబాద్ మాతామైదాన్‌లో కొలువుదీరిన శ్రీవిజయదుర్గా మాతను నిర్వాహకులు గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న ధనుంజయ నాయుడు

నాగోలు: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు అన్నారు. శుక్రవారం కొత్తపేట డివిజన్ న్యూనాగోలులోని ఎస్‌కే దాంగే భవన్ లో బీసీ ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. జనగణనలో కులగణన చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. కుల గణన చేపడతామని ప్రకటించి ఆర్డినెన్స్ జారీ చేయడం బీసీల విజయంగా అభివర్ణించారు. బీసీల కు రాజ్యాంగబద్ధమైన హక్కులు ఇతర డిమాండ్లను నెరవేర్చే వరకు బీసీలు ఉద్యమాలను కొనసాగిస్తూనే ఉండాలన్నారు. కులగణన అనంతరం విద్య ఉద్యోగ ఆర్థిక రాజకీయ రంగాల్లో బీసీలకు వాటా దక్కుతుందన్న విషయాన్ని వివిధ రంగాల్లో పనిచేస్తున్న నాయకులు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. భారతదేశం ప్రపంచంలో అగ్ర దేశంగా అభివృద్ధి చెందుతుందని పాలకులు ప్రకటించుకుంటున్నారని దేశంలో 56శాతం బీసీలు వివక్షతకు గురవుతుంటే దేశం ఎలా అగ్రరాజ్యం అవుతుందని, నిజంగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీలకు విద్యా ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ ఎత్తివేయాలని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బీసీలకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, నాయకులు పిల్లుట్ల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడదను నివారించండి



దీసీకి వినతి పత్రం అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకుడు కోట్ల లడ్డూపటేల్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో వీధి కుక్కల బెడదను నివారించాలని హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కోట్ల లడ్డూపటేల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మంగతాయారు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐఎస్‌సదన్ డివిజన్‌లోని వాణీనగర్, లక్ష్మీనగర్, పూర్ణోదయా కాలనీల్లోని అంతర్గత రహదారులపై వీధి కుక్కలు రోడ్లపై వెళుతున్న వారిపై దాడులు చేస్తున్నాయన్నారు. కుక్కల కారణంగా పలువురు చిన్నారులు గాయ పడినట్లు తెలిపారు. అదేవిధంగా ఆయా కాలనీల్లో వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే స్పందించి కుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పంజేషాహలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం టీజీఎస్‌పీసీడీఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగల తొలగింపు, కేబుల్ వ్యవస్థ, 11 కేవీ, 33 కేవీ భూగర్భ విద్యుత్‌లైన్ ప్రక్రియపై అధికారులతో చర్చించారు. కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సమావేశంలో టీజీఎస్ పీసీడీఎల్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.